

## స్వదేశానికి మోర్కెల్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో అనుభవలేమితో ఉన్న భారత పేస్ బౌలింగ్ యూనిట్‌కు మరో ఎదురుదెబ్బ. టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్.. సోమవారం దుబాయ్ నుంచి హుటాహుటిన దక్షిణాఫ్రికాకు వెళ్లాడు. అతడి తండ్రి ఆల్బర్ట్ కన్నుమూయడంతో మోర్నీ ఉన్నఫళంగా సౌతాఫ్రికా వెళ్లాల్సి వచ్చింది. బుమ్రా గైర్హాజరీ నేపథ్యంలో షమీ నేతృత్వంలో బరిలోకి దిగబోయే భారత జట్టులో కుర్రాళ్లు హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ రాణాకు మోర్నీ దిశానిర్దేశం చేస్తాడని భావిస్తున్న తరుణంలో అతడు సౌతాఫ్రికాకు వెళ్లడం భారత్‌ను ఇబ్బందులకు గురిచేసేదే.

### 'నేను రాజీనామా చేయలేదు'

ఢిల్లీ: బాక్సింగ్ దిగ్గజం, భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్ మేరీకోమ్ తన పదవికి రాజీనామా చేశారని వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. తాను రాజీనామా చేయలేదని, పూర్తికాలం (2026 దాకా) పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇటీవల ముగిసిన జాతీయ క్రీడల ముగింపు వేడుకల సందర్భంగా తనకు కేటాయించిన హోటల్‌లో కలిగిన అసౌకర్యంపై ఆమె.. ఐవోఏ సిబ్బందితో చేసిన వాట్సాప్ చాట్ లీక్ అవడంతో కోమ్ రాజీనామా అంశం తెరపైకి వచ్చింది.

### భారత హాకీ జట్ల ఓటమి

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్‌లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లకు పరాభవం. మంగళవారం కళింగ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పురుషుల జట్టు 1–4తో జర్మనీ చేతిలో చిత్తైంది. భారత్ తరపున గుర్జాంత్ సింగ్ 13వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చినా ఆ తర్వాత జర్మనీ జోరు ముందు ఆతిథ్య జట్టు తేలిపోయింది. మహిళల విభాగంలో భారత్ 3–4తో స్పెయిన్ చేతిలో పోరాడి ఓడింది. బల్జీత్ కౌర్ (19ని), సాక్షి రాణా (38ని) రుతజ (45ని) గోల్స్ చేశారు. స్పెయిన్ నుంచి ఎస్టెల్ (25ని, 49ని), సోఫియా (21ని), లుసియా (52ని) గోల్స్ కొట్టారు.

మూడు దశాబ్దాల తర్వాత పాక్‌లో ఐసీసీ టోర్నీ

కట్టుదిట్టమైన భద్రత కల్పించిన ప్రభుత్వం

ప్రత్యేక ఆకర్షణగా దాయాదుల పోరు

# చాంపియన్స్ వార్

నేటి నుంచి మెగాటోర్నీ ప్రారంభం



**క్రికెట్‌లో టీ20లకు పెరుగుతున్న క్రేజ్, టెస్టులకు ఆయా బోర్డులు ఇస్తున్న ప్రాధాన్యం దృష్ట్యా వన్డేల మనుగడే ప్రశ్నార్థకమవుతూ భవిష్యత్‌లో ఈ ఫార్మాట్ మనగలుగుతుందా? లేదా? అని చర్చోపచర్చలు సాగుతున్న వేళ 50 ఓవర్ల క్రికెట్ మజాను అందించడానికి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సిద్ధమైంది. మూడు దశాబ్దాల విరామం తర్వాత పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీకి బుధవారం తెరలేవనుంది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 దాకా జరుగబోయే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భద్రతా కారణాల రీత్యా భారత్ ఆడే మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహించదలిచినా పాక్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. ప్రపంచ క్రికెట్‌లో ఐసీసీ టోర్నీ నిర్వహణకు సంబంధించి దాదాపుగా మునుపెన్నడూ జరగనన్ని చర్చలు, రెండు దేశాల బోర్డుల పట్టువిడుపులతో అసలు ఈ ఈవెంట్ జరుగుతుందా? లేదా? అన్న విఘ్నాలన్నింటినీ విజయవంతంగా అధిగమించిన చాంపియన్స్ ట్రోఫీని పాక్ ఏ మేరకు విజయవంతంగా నిర్వహిస్తుందనేది ఆసక్తికరం!**

కరాచీ: ఎనిమిదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు బుధవారంతో తెరపడనుంది. ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి బుధవారం నుంచి తెరలేవనుంది. 1996 తర్వాత పాకిస్థాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీ నిర్వహణపై యావత్ దేశం భారీ అంచనాలే పెట్టుకుంది. 9వ ఎడిషన్‌గా జరుగబోయే ఈ టోర్నీని ఫిబ్రవరి 19 నుంచి మార్చి 09 దాకా పాకిస్థాన్, దుబాయ్‌లలో నిర్వహించనున్నారు. 2009లో శ్రీలంక క్రికెట్ జట్టుపై లాహోర్‌లో జరిగిన ఉగ్రమూకల దాడికి ఫలితంగా 15 ఏండ్ల పాటు స్వదేశంలో భారీ టోర్నీలకు దూరమై అనధికారిక శిక్షను అనుభవిస్తున్న పాకిస్థాన్ క్రికెట్‌కు ఆ మచ్చను తుడిపేసి 'మా దేశం భద్రమే' అని ప్రపంచానికి సగర్వంగా చాటి చెప్పడానికి దాయాదికి ఇది సువర్ణావకాశం. బుధవారం ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య కరాచీ వేదికగా తొలి మ్యాచ్ జరుగనుంది. టోర్నీకి ప్రత్యేక ఆకర్షణ అయిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్‌లో జరుగుతుంది. మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు మొదలవుతాయి.

**టీమ్‌ఇండియా షెడ్యూల్**

| తేదీ | ప్రత్యర్థి |
|---|---|
| ఫిబ్రవరి 20 | బంగ్లాదేశ్ |
| ఫిబ్రవరి 23 | పాకిస్థాన్ |
| మార్చి 02 | న్యూజిలాండ్ |

**భారత మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరుగుతాయి.**

**స్టార్ స్పోర్ట్స్ (టీవీ), జియో హాట్‌స్టార్ (యాప్)లో లైవ్**

### 2 గ్రూపులు.. 8 జట్లు.. 15 మ్యాచ్‌లు

వన్డేలలో ర్యాంకుల ఆధారంగా మొదటి 8 ర్యాంకులు కలిగిన దేశాలు ఆడనున్న ఈ టోర్నీలో జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. **గ్రూప్–ఏలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, భారత్, న్యూజిలాండ్ ఉండగా గ్రూప్–బీలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్ ఉన్నాయి.** రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగబోయే ఈ టోర్నీలో భాగంగా గ్రూప్ దశ (మొత్తం 12 మ్యాచ్‌లు)లో ప్రతి జట్టు తమ గ్రూపులోని ఇతర జట్లతో ఒక మ్యాచ్ ఆడుతుంది. 19 నుంచి వచ్చే నెల 02 దాకా గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగనుండగా ఈ దశలో టాప్–2లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. దుబాయ్‌లో తొలి, లాహోర్‌లో రెండో సెమీస్ జరుగుతుంది. ఒకవేళ భారత్ ఫైనల్‌కు చేరితే టైటిల్ పోరు దుబాయ్‌లోనే జరుగుతుంది.

### ఫేవరెట్‌గా భారత్

ఈ టోర్నీ టైటిల్ ఫేవరెట్లలో భారత్ ముందు వరుసలో ఉందనడంలో సందేహమే లేదు. ధోనీ సారథ్యంలో 2013లో చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన భారత జట్టు 2017 ఫైనల్‌లో పాకిస్థాన్ చేతిలో ఓడిపోయింది. పుష్కరకాలం విరామం తర్వాత ఈసారి టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ బరిలో ఉంది. ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన రోహిత్ సేన.. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా నిలిచింది. భారత్‌తో పాటు రెండుసార్లు విజేత అయిన ఆస్ట్రేలియా, ఆతిథ్య పాకిస్థాన్, మాజీ చాంపియన్ న్యూజిలాండ్, ఇంతవరకూ ట్రోఫీ నెగ్గని ఇంగ్లండ్ కూడా ఈసారి పట్టు విడవకూడదనే కృతనిశ్చయంతో ఉన్నాయి. వన్డే ప్రపంచకప్‌లో సంచలన విజయాలు నమోదుచేసిన అఫ్గానిస్థాన్.. ఈ టోర్నీలో అగ్రశ్రేణి జట్లకు ఏ మేరకు షాకులిస్తుందో చూడాలి.

### 'రోకో'.. ఆఖరి మోకా

వన్డే ఫార్మాట్‌లో దిగ్గజాలుగా వెలుగొందుతున్న భారత సారథి రోహిత్ శర్మతో పాటు పరుగుల యంత్రం విరాట్ కోహ్లీకి బహుశా ఇదే ఆఖరి ఐసీసీ వన్డే టోర్నీ! ఇప్పటికే కెరీర్ చరమాంకంలో ఉన్న ఈ ద్వయం 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారనుకోవడం అత్యాశే. 'రోకో' 2023 వన్డే ప్రపంచకప్‌తోనే ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతారని ఊహాగానాలు వినిపించినా ఆ టోర్నీ తుది మెట్టుపై భారత్ బోల్తా కొట్టడం వీరిని నిరాశపరిచింది. ఇటీవల కాలంలో వయసు, ఫామ్‌లేమితో సతమతమవుతున్నా స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రాణించిన ఈ దిగ్గజాలు తమకు అచ్చొచ్చిన చాంపియన్స్ ట్రోఫీలో ఏం చేస్తారనేది ఆసక్తికరం. రోకోతో పాటు ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్, కివీస్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్, ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్, అఫ్గాన్ మాజీ సారథి మహ్మద్ నబీ వంటి క్రికెటర్లకు ఇదే చివరి వన్డే టోర్నీ కావొచ్చు!

## పర్లేదు.. ఫ్యామిలీని తెచ్చుకోవచ్చు!

- వెనక్కి తగ్గిన బీసీసీఐ



దుబాయ్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ వైఫల్యం తర్వాత విదేశీ పర్యటనలకు ఆటగాళ్ల కుటుంబాలను వెంట తీసుకెళ్లే విషయంలో కఠిన నిబంధనలను తీసుకొచ్చిన బీసీసీఐ.. కాస్త వెనక్కి తగ్గింది. చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌కు వెళ్లిన భారత జట్టు ఆటగాళ్లతో భాగస్వాములు, కుటుంబాలను వెంట తీసుకెళ్లేందుకు అనుమతినివ్వని బోర్డు.. ఒక మ్యాచ్ చూడటానికి కుటుంబాన్ని తీసుకొచ్చుకునేందుకు అనుమతినిచ్చింది. అయితే ఇందుకు సదరు ఆటగాళ్లు.. తమ ఫ్యామిలీలు ఏ మ్యాచ్ చూడాలనుకుంటున్నారో బీసీసీఐకి ముందుగా సమాచారం అందించాలని బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు.

## ముంబై బోణీ

గుజరాత్ జెయింట్స్‌పై విజయం



సీవర్ బ్రంట్ (57)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. గుజరాత్ జెయింట్స్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచింది. బంతితో పాటు బ్యాట్‌తోనూ అదరగొట్టిన ముంబై.. గుజరాత్ నిర్దేశించిన 121 పరుగుల లక్ష్యాన్ని 16.1 ఓవర్లలోనే ఊదేసింది. సీవర్ బ్రంట్ (39 బంతుల్లో 57, 11 ఫోర్లు) దూకుడుగా ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. మరోసారి టాపార్డర్ వైఫల్యంతో 120 పరుగులకే కుప్పకూలింది. హర్లీన్ డియోల్ (32) టాప్ స్కోరర్. ముంబై బౌలర్లలో హేలి మాథ్యూస్ (3/16), అమెలియా (2/22) జెయింట్స్‌ను కట్టడిచేశారు.

## కష్టాల్లో ముంబై

విదర్భతో రంజీ సెమీస్



నాగ్‌పూర్: విదర్భతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీస్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై కష్టాల్లో పడింది. రెండో రోజు ప్రత్యర్థిని 383 పరుగులకు ఆలౌట్ చేసిన ముంబై.. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 188 రన్స్ చేసింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (67 బ్యాటింగ్) అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 195 పరుగులు వెనుకబడి ఉంది. ముంబై సారథి అజింక్యా రహానే (18) నిరాశపరచగా టీమ్‌ఇండియా సూపర్ స్టార్లు సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబె డకౌట్ అయ్యారు. విదర్భ బౌలర్లలో పార్థ్ (3/16), యశ్ ఠాకూర్ (2/56) ముంబైని కట్టడి చేశారు. ఇక అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో కేరళ 418/7 పరుగుల భారీ స్కోరు చేసింది. అజారుద్దీన్ (149 బ్యాటింగ్) సెంచరీతో మెరిశాడు.



## ఛత్రపతి శివాజీ పాత్రలో రిషబ్ శెట్టి

'కాంతార' చిత్రం ద్వారా దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకున్నారు కన్నడ నటుడు రిషబ్‌శెట్టి. దక్షిణ కన్నడ సంస్కృతి, ఆచార వ్యవహారాల నేపథ్యంలో రూపొందిన డివోషనల్ థ్రిల్లర్‌గా 'కాంతార' పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ దక్కించుకుంది. ప్రస్తుతం రిషబ్‌శెట్టి 'కాంతార' ప్రీక్వెల్ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. తెలుగులో 'జై హనుమాన్' సినిమా చేస్తున్నారు. ఇదిలావుండగా ఆయన ఛత్రపతి శివాజీ పాత్రలో నటించనున్నారని గతంలో వార్తలొచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సందీప్‌సింగ్ దర్శకత్వం వహిస్తారు. ఈ ఏడాది మే నెలలో జరుగనున్న ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రిషబ్‌శెట్టి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తామని, 2027 జనవరి 21న హిందీతో పాటు వివిధ భారతీయ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో మొఘల్స్‌తో శివాజీ సాగించిన పోరాటం, సాంఘిక న్యాయం కోసం ఆయన చేపట్టిన సంస్కరణలను చూపించబోతున్నామని మేకర్స్ పేర్కొన్నారు.

## ఇచ్చినమాట తప్పడు.. వచ్చేస్తాడు!



నాలుగేళ్ల క్రితం వచ్చిన 'వకీల్‌సాబ్'లో సోలో హీరోగా నటించారు పవన్‌కల్యాణ్. ఆ తర్వాత వచ్చిన 'భీమ్లా నాయక్'లో రానాతో, 'బ్రో' సినిమాలో సాయిదుర్గతేజ్‌తో స్క్రీన్‌షేర్ చేసుకున్నారు. అంటే.. పవన్‌కల్యాణ్ సోలో హీరోగా కనిపించి నాలుగేళ్లయ్యిందన్నమాట. అందుకే.. అభిమానులు పవర్‌స్టార్ సోలో ఎంట్రీ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆయనవి రెండు సినిమాలు సెట్స్ మీదున్నాయి. వాటిలో ఒకటి 'హరిహర వీరమల్లు' కాగా, రెండోది 'ఓజీ'. రెండు సినిమాల షూటింగులూ దాదాపు పూర్తికావొచ్చాయి. అయితే.. వాటిలో ముందు 'హరిహర వీరమల్లు' ఉంటుందని గతంలోనే వెల్లడించారు. ఈ సినిమాను మార్చి 28న విడుదల చేయనున్నట్టు డేట్‌ను కూడా ప్రకటించారు. అయితే.. ఇటీవల 'హరిహర వీరమల్లు' విడుదల ఆలస్యం కానున్నదంటూ కొన్ని వార్తలు మీడియా సర్కిల్స్‌లో హల్‌చల్ చేశాయి. దీనిపై నిర్మాత ఏఎం రత్నం స్పందించారు. ''హరిహర వీరమల్లు'ను ఎట్టి పరిస్థితుల్లో అనుకున్న డేట్‌కే విడుదల చేస్తాం. ఈ సినిమాకు సంబంధించిన మెజారిటీ వర్క్ పూర్తయింది. బ్యాలన్స్ వర్క్‌ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి అనుకున్న డేట్‌కే విడుదల చేస్తాం.' అని తెలిపారు ఏఎం రత్నం. ఈ సినిమాలోని రెండో పాట ఈ నెల 24న విడుదల కానున్నది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.



చిత్రం

## సుకుమార్ సినిమా జోనర్ అదేనా?

ప్రస్తుతం రామ్‌చరణ్ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. రామ్‌చరణ్ నటిస్తున్న 16వ చిత్రమిది. దీని తర్వాత ఆయన సుకుమార్ డైరెక్షన్‌లో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ సెట్స్‌మీదకు వెళ్లడానికి ఇంకా చాలా సమయం ఉంది. అయితే ఈ సినిమా జోనర్ గురించి సోషల్‌మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. 'రంగస్థలం' నుంచి 'పుష్ప' సిరీస్‌లోని రెండు చిత్రాల వరకు సుకుమార్ మాస్ కథలతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేశారు. దీంతో రామ్‌చరణ్ సినిమాకు ఆయన మళ్లీ మాస్ కథనే ఎంచుకుంటారా? లేదా కొత్త దారిలో వెళతారా అన్నది అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం న్యూఏజ్ యాక్షన్ డ్రామాగా సుకుమార్ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. ఇందులో రామ్‌చరణ్ మోడరన్ లుక్స్‌తో కనిపిస్తారని, గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరువయ్యేలా యాక్షన్, అడ్వెంచర్, రొమాన్స్ అంశాల కలబోతగా సుకుమార్ ఈ సినిమాను తీర్చిదిద్దబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.



## రజనీతో కలిసి ప్రత్యేకగీతం

హిందీ చిత్రసీమలో వరుస పరాజయాలు పలకరించడంతో ఇప్పుడు తమిళ ఇండస్ట్రీపై దృష్టి పెడుతున్నది అగ్ర కథానాయిక పూజా హెగ్డే. దళపతి విజయ్ 'జన నాయగన్', సూర్య 'రెట్రో' చిత్రాల్లో ఈ భామ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కోలీవుడ్‌లో ఈ సొగసరి మరో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో పూజాహెగ్డే స్పెషల్‌సాంగ్‌లో నర్తిస్తున్నదని తెలిసింది. ప్రస్తుతం ఈ పాట షూటింగ్ జరుగుతున్నదని, ఇందులో పూజాహెగ్డే నృత్యాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. పూజాహెగ్డేకు ఐటెం సాంగ్స్ కొత్తేమి కాదు. గతంలో రంగస్థలం, ఎఫ్–3 చిత్రాల్లో ఈ అమ్మడు ప్రత్యేక గీతాల్లో మెరిసింది. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'దేవ' బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్‌గా నిలవడంతో పూజాహెగ్డేకు నిరాశే ఎదురైంది. హిందీలో వరుస ఫ్లాపులను దృష్టిలో పెట్టుకొని ఇకపై దక్షిణాది సినిమాలకు ప్రాధాన్యతనివ్వాలనే ఆలోచనలో ఉందట పూజాహెగ్డే.

## అఖండతో తలపడనున్న ఖల్‌నాయక్?



తెరపై హీరో, విలన్ కొట్టుకుంటే అది మామూలే. అదే ఇద్దరు హీరోలు తలపడితే ఫ్యాన్స్‌లో వచ్చే కిక్కే వేరు. రీసెంట్‌గా 'ఆర్ఆర్ఆర్' సినిమా అలాంటి కిక్‌నే ఇచ్చింది. అయితే.. వారిద్దరూ యువ హీరోలు. త్వరలో అలాంటి కిక్‌నే ఇద్దరు సీనియర్ హీరోలతో అందించడానికి రంగం సిద్ధమవుతున్నది. ఆ హీరోలు ఎవరోకాదు.. నందమూరి బాలకృష్ణ, బాలీవుడ్ ఖల్‌నాయక్ సంజయ్‌దత్. 'అఖండ 2 –తాండవం'లో కథ రీత్యా.. అఖండ రుద్ర సికిందర్ అఘోరాను ఢీకొట్టే పాత్ర ఒకటుందట. ఆ పాత్ర కోసం దర్శకుడు బోయపాటి సంజయ్‌దత్‌ను సంప్రదించారట. కథ విని సంజయ్ కూడా ఓకే చెప్పేశారట. ఈ సినిమాను నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట పాన్‌ఇండియా స్థాయిలో నిర్మిస్తుండటంతో వివిధ భాషలనుంచి నటీనటులను తీసుకుంటున్నారు. అందులో భాగంగానే కాక, కథ కూడా డిమాండ్ చేయడంతో సంజయ్‌దత్‌ని తీసుకోబోతున్నారని తెలుస్తున్నది. ఇందులో బాలయ్య, సంజయ్ పాత్రల మధ్య పోరాటం నువ్వానేనా అనే స్థాయిలో ఉంటుందట. బాలకృష్ణ, సంజయ్ కెరీర్‌లను గమనిస్తే.. చాలా విషయాల్లో ఇద్దరిలో సారూప్యత కనిపిస్తుంది. ఇద్దరు 70ల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టినవారే. 80ల్లో హీరోలుగా ఎదిగినవారే. ఇద్దరూ మాస్ హీరోలే. పైగా ఇద్దరూ స్టార్ కిడ్సే కావడం విశేషం.



## నా జిందగీ నిండుగా చల్లావు రంగులే..

కిరణ్ అబ్బవరం, రుక్సర్ ఢిల్లాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దిల్ రూబా'. విశ్వకరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 'హే జింగిలి..' అంటూ సాగే రెండో గీతాన్ని విడుదల చేశారు. 'హే నా జింగిలి.. నా జిందగీ నిండుగా చల్లావే రంగులే.. నా సింగిలూ లైఫ్‌నే తిప్పావు రింగులా..' అంటూ ఈ పాట సాగింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ పాట చాలా బాగా వచ్చింది. తొలిసారి ప్రేమలో పడ్డ అబ్బాయి కింగ్‌లా ఫీలవుతాడు. అది విఫలమై రెండోసారి ప్రేమలో పడ్డప్పుడు అతనిలో ఓ భయం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే పాట ఇది. భాస్కరభట్ల మంచి సాహిత్యాన్ని అందించారు' అన్నారు. తన సినిమాలన్నింటిలో ఇది చాలా పవర్‌ఫుల్ పాత్ర అని, మ్యూజికల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని హీరో కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. ఈ సినిమాకు ఆయువుపట్టులాంటి పాట ఇదని, చక్కటి భావాలతో ఆకట్టుకుంటుందని గీత రచయిత భాస్కరభట్ల తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాతలు: రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ, రచన–దర్శకత్వం: విశ్వ కరుణ్.

## సందేశాత్మకంగా 'దీక్ష'



ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకనిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం 'దీక్ష'. కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటించారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చనే పాయింట్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు మైథలాజికల్ అంశాలను జోడించి ఈ సినిమాను రూపొందించాం. కథానుగుణంగా ఐదు అద్భుతమైన పాటలు కుదిరాయి. భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఆక్సఖాన్, తులసి, అనూష తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

## ఆ సంఘటనతో మారాను

'**జీవితం** అన్న తర్వాత ఒడిదుడుకులు సహజం. కుదుపులు లేకుండా ప్రయాణం సాగదు. నా జీవితంలో పెద్ద కుదుపు ఏడాది క్రితం జరిగిన యాక్సిడెంట్. దాని వల్ల చాలా విషయాలు నేర్చుకున్నా.' అంటున్నది అందాలభామ నభా నటేష్. నన్ను దోచుకుందువటే, ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాలభామకు సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో, డార్లింగ్ సినిమాల రూపంలో పరాజయాలు పలకరించాయి. ఈ బాధ నుంచి తేరుకునే లోపే పుండుకు పుల్ల మొగుడు అన్న చందాన.. నభా నటేష్‌కు యాక్సిడెంట్ అయ్యింది. సర్జరీలు కూడా జరిగాయి. దాంతో ఓ ఏడాది పాటు సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం నభా తేరుకున్నది. ప్రస్తుతం నిఖిల్‌తో 'స్వయంభూ' సినిమా చేస్తూ బిజీగా ఉన్నది. ఇటీవల జిమ్‌లో తాను వర్కవుట్ చేస్తున్న ఓ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి, కామెంట్‌ని కూడా జత చేసింది నభా. 'యాక్సిడెంట్ తర్వాత, తిరిగి మామూలు స్థితికి రావడానికి చాలా శ్రమించా. ఆ క్షణంలో మానసికంగా ఎంతో బాధ అనుభవించా. ఫిట్‌నెస్ కోసం శ్రమించా. ఇప్పుడు నా శరీరంపై నాకు అవగాహన పెరిగింది. మొబిలిటీ ఎక్సర్సైజ్‌లు, స్విమ్మింగ్, డ్యాన్సింగ్ చేయడానికి ఇష్టపడుతున్నా. నటిగా ఉన్నప్పుడు తప్పదు కాబట్టి వ్యాయామం చేశా. ఇప్పుడు తప్పనిసరిగా వ్యాయామం చేస్తున్నా. ఈ యాక్సిడెంట్ వల్ల వర్కవుట్స్ విషయంలో నా ఆలోచనాధోరణి మారింది.' అని చెప్పుకొచ్చింది నభానటేష్.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.